సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం ၊ 1 ၊ ఏప్రిల్ ၊ 2023



రోజేదారో .. జర ధ్యాన్‌దో..
రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేపట్టేవారు షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలు ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. -8లో..



విడిపోయిన రైలు వ్యాగిన్లు
కడప-నందలూరు సెక్షన్ల మధ్య శుక్రవారం ఐరన్‌ఓర్ (ఏకేపీకే) కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే గూడ్స్‌రైలు వ్యాగిన్లు విడిపోయాయి. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.70	రూ.108



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 246 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	510	540
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 238.88 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
రాజంపేట	6.32	4.52
రాయచోటి	6.32	4.49
మదనపల్లి	6.33	4.51
పీలేరు	6.29	4.46

న్యూస్‌రీల్

పీలేరులో మీటర్ హీరో కిరణ్ సందడి



ఎంజేఆర్ కళాశాలలో హీరో కిరణ్ అబ్బవరం

పీలేరు: మీటర్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో కిరణ్ అబ్బవరం పీలేరులో సందడి చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మీటర్ సినిమా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7న విడుదల కానున్న మీటర్ సినిమాను ఆదరించాలని కోరారు. తాను కూడా ఈ ప్రాంతంలో పుట్టి పెరిగానని, పీలేరుతో మంచి అనుబంధం కలిగి ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, అభిమానులు హీరో కిరణ్‌తో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు. కార్యక్రమంలో ఎంజేఆర్ కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు, అభిమానులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

రాయచోటి అర్బన్: ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులను నిర్వర్తించాలని అన్నమయ్యజిల్లా డీపీటీఓ పి.రాము పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి ఆర్టీసీ డిపోను తనిఖీచేశారు. ట్రాఫిక్‌సెక్షన్‌లోని అన్ని రూములు, డీఎం కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం డిపో మెయిన్ గేట్ వద్ద ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు,సిబ్బంది ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రతిరూట్‌కు కండక్టర్,డ్రైవర్‌లు, బస్సులను ఫిక్స్‌డ్‌గా ఉంచాలన్నారు.కార్యక్రమంలో డీఎం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అచ్చెన్న హత్యాస్థలం పరిశీలన

కడప కార్పొరేషన్: పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్య జరిగిన ప్రదేశాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం కడపకు విచ్చేసిన ఆయన రాయచోటి రోడ్డులో ఘాట్‌లో డాక్టర్ అచ్చెన్న మృత దేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించి హత్య జరగడానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం చేరుకొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై విహరించిన జానకిరమణుడు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

జగదభిరాముడి ప్రభ..
జగమంతా శోభ



ధ్వజస్తంభానికి హారతి ఇస్తున్న పండితులు



ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



స్వామివారిని చూసి తన్మయులై నమస్కరిస్తున్న భక్తులు



అలరించిన కళాకారుల కోలాటం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితులు ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత హోమం జరిపారు.అనంతరం గరుడ పతాకాన్ని ఎగురవేశారు.కంకణభట్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వృషభలగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సీతారామలక్ష్మణులు ఒంటిమిట్ట పురవీధుల్లో శేషవాహనంపై విహరించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీసమేతంగా ఒంటిమిట్టకు విచ్చేశారు. పూజలు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అధికారులు, ఒంటిమిట్ట, సిద్దవటం, రాజంపేట నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు వేణుగానాలంకారణలో ధాశరథి దర్శనమివ్వనున్నారు. రాత్రి 8 గంటలకు హంసవాహనంపై స్వామివారు విహరిస్తారు.



మాడ వీధుల్లో శేష వాహనంపై విహరిస్తున్న కోదండ రాముడు

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్యాణోత్సవం రోజున పట్టువస్త్రాలు సమర్పణకు వచ్చినప్పుడు ఆలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో వారు చర్చించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతుల గురించి మాట్లాడారు. జిల్లా కార్యక్రమంలో టీటీడీ డీఎఫ్‌వో శ్రీనివాస్, ఎస్ఇ(ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్, ఇఇ సుమతి, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, నటేష్ బాబు, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ సాయికాంత్ వర్మ, జేఈవో వీరబ్రహ్మం

పకడ్బందీగా పది పరీక్షలు

రాయచోటి: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ విద్యాశాఖ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో గత సంవత్సరం పదో తరగతి పరీక్షలు బాగా నిర్వహించి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఈ ఏడాది కూడా ఎలాంటి పొరపాట్లకు, సంఘటనలకు తావివ్వొద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని డీఈఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. డీఈఓ పురుషోత్తం మాట్లాడుతూ పరీక్షా సమయం 15 నిమిషాల ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను ఓపెన్ చేయాలన్నారు.

పరీక్షలు రాయనున్న 22,395 మంది విద్యార్థులు
అన్నమయ్య జిల్లాలో పదోతరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా పరీక్షల పరిశీలకులు వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చిత్రంలో డీఈఓ పురుషోత్తం

శుక్రవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలో 485 పాఠశాలలో 22,395 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారన్నారు. ఏప్రిల్ నెల మూడోతేది నుంచి 123 పరీక్షా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించేందుకు మౌళిక వసతులను కూడా పూర్తి చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు 1260 మంది ఇన్విజిలేటర్లను, 16 మంది సిట్టింగ్ స్క్వాడ్, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేస్తారన్నారు. పరీక్షల నిర్వహణలో లోపాలు ఉంటే కంట్రోల్ రూమ్ సెల్ ఫోన్ నెంబరు. 9573133385కు సమాచారం ఇవ్వాలన్నారు.

సంస్మరణ





శ్రీనాథ్‌రెడ్డి ఆత్మశాంతి కోసం మౌనం పాటిస్తున్న దృశ్యం, దివంగత జర్నలిస్టు నరసింహులు పెద్ద కుమార్తె మౌక్తికకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న 'మనం' ప్రతినిధులు

ప్రముఖ జర్నలిస్టు, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ హోం మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో జాతీయ మీడియా ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ తులసిరెడ్డి, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జి.లక్ష్మిరెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు జి.చంద్ర, చంద్రశేఖర్, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాసరెడ్డి, హిందూ దినపత్రిక మాజీ రెసిడెంట్ ఎడిటర్ ప్రశాంత్‌రెడ్డి, జానమద్ది విజయభాస్కర్, మనం స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రామాంజనేయులు, ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడారు. శాసన మండలి సభ్యులు సి.రామచంద్రయ్య, తిరుపతి నుంచి సీనియర్ జర్నలిస్టు రవికుమార్‌లు పంపిన సందేశాలను సభాధ్యక్షుడు నాగిరెడ్డి చదివి వినిపించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి వందన సమర్పణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి టీవీ నాగిరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాగా, ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు నరసింహులు పెద్ద కుమార్తె మౌక్తిక సివిల్ సర్వీస్ శిక్షణకు మనం సంస్థ ప్రతినిధులు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. నరసింహులు చిన్నకుమార్తె చదువుకోసం రూ.లక్ష చెక్కును కడప జర్నలిస్టు మిత్రులు అందజేశారు.
–కడప సెవెన్‌రోడ్స్

మామిడికాయలొచ్చాయ్!



- ప్రస్తుతం మార్కెట్‌లో కనిపిస్తున్న లాల్‌బహార్, ఖాదర్ రకాలు
- ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు చేరుకున్న వ్యాపారులు
- ఎక్కడికక్కడ కాయల కొనుగోలుకు శ్రీకారం
- తోటల వద్ద కొనుగోలు చేసి... ప్యాక్‌హౌస్‌లో గ్రేడింగ్ చేసి రవాణా



ప్యాక్‌హౌస్‌లో గ్రేడింగ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్న కాయలు

సాక్షి రాయచోటి: మామిడికాయల సీజన్ రానే వచ్చింది. అందుకు తగ్గట్టుగా కాయలు కూడా మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర కూడా రూ. 60–70 వేలు ఉండడం శుభపరిణామమే. అందులోనూ మామిడికి సంబంధించి అన్నమయ్య జిల్లా ప్రసిద్ధి కావడంతో జిల్లాకు కూడా పలువురు ఇతర రాష్ట్రాలకు చెందిన సేట్లు (వ్యాపారులు)లు చేరుకున్నారు. మామిడి పంటకు సంబంధించి ప్రధానంగా లాల్ బహార్, ఖాదర్ రకాల కాయలు ముందస్తుగా దిగుబడి రావడంతో వ్యాపారులు ఎక్కడికక్కడ కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉన్నట్లు ఉద్యానశాఖ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

అన్నమయ్య జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి
సాగులో ఉండగా ప్రస్తుతం పెద్ద చెట్లు కాయలు కాచేవి దాదాపు 20 వేల హెక్టార్లలో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది మామిడికి సంబంధించి 2.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే మార్కెట్‌కు రెండు, మూడు రకాల కాయలు అందుబాటులోకి వచ్చాయి. ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లో బండ్ల మీద కూడా పండ్ల వ్యాపారం సాగుతోంది. మరో పది పదిహేను రోజుల్లో అన్నిరకాల పండ్లు మార్కెట్‌కు రానున్నాయి.

జిల్లాలో మామిడి సాగు:	37 వేల హెక్టార్లు
దిగుబడి:	2.60 లక్షల మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం టన్ను మామిడి ధర:	రూ.70 వేలు
సీజన్:	ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు

జిల్లాలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు
జిల్లాలో పండించిన మామిడి పండ్ల కొనుగోలుకు డిమాండ్ ఉంది. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వస్తుంటారు. ఇప్పుడు కూడా రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట తదితర ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కాయలను కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా మహరాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యాణ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి స్థానికంగా లాడ్జీలు లేదా ప్రత్యేకంగా రూములు తీసుకుని మూడు నెలలపాటు ఇక్కడే ఉంటున్నారు. మామిడి మార్కెట్ ముగిసేంతవరకు ఇక్కడే ఉండి కొనుగోళ్లు పూర్తయిన తర్వాత స్వంతూళ్లకు పయనమవుతారు.

తోటల వద్దనే కొనుగోళ్లు
జిల్లాలో మామిడికి సంబంధించి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. స్థానిక వ్యాపారుల ద్వారా ఇతర రాష్ట్రాలకు చెందిన సేట్లు తోటల్లోని కాయలను కొనుగోలు చేసి అడ్వాన్సులు సైతం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పక్వానికి వచ్చిన కాయలను తోటల వద్ద కోసి..ప్యాక్‌హౌస్‌కు తీసుకొచ్చి గ్రేడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా అంతటా అత్యధికంగా మామిడి సాగు కావడంతో అన్నిచోట్ల ప్రస్తుతమున్న ధరల మేరకు కొనుగోలు చేస్తున్నారు.

జూన్ వరకు మార్కెట్‌లో కాయలు
మామిడి పంటకు సంబంధించి కాయలు మార్చి నెలాఖరు నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఏప్రిల్ నెలనుంచి జూన్ వరకు అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి భారీగా మామిడి కాయలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో మామిడికి సంబంధించి బెంగళూరు, బేనీషా, నీలం, ఇమామ్ పసంద్, లాల్ బహార్, ఖాదర్, చెరుకు రసం, మల్లిక, సువర్ణ రేఖ, దసేరి, మలుగ్బా తదితర రకాల కాయలను సాగు చేశారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ చివరి వరకు మామిడిపండ్లతో జిల్లాలోని మార్కెట్లు కళకళలాడనున్నాయి.



ప్యాకింగ్ చేస్తున్న లాల్ బహార్ కాయలు

మోహినీరూపం.. మురిసిన భక్తజనం

సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన పట్టాభిరాముడు

వాల్మీకిపురం: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వాల్మీకి క్షేత్రంలోని శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం రాత్రి 8గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజోమూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామివారు తిరుమాడ వీధుల్లో విహరించారు. సూర్యప్రభ వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ జరిపారు. రాత్రి 8గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరిటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మోహినీ అవతారంలో శ్రీరామచంద్రమూర్తి

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం 8గంటల నుంచి తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ఊంజలసేవ, 8నుంచి 10గంటల వరకు శ్రీరామ కళ్యాణోత్సవం, 11నుంచి 2.30గంటల వరకు గరుడసేవ.



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

క్లుప్తంగా

దంపతులపై దాడి

మదనపల్లె : అప్పు చెల్లించమన్నందుకు దంపతులపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగింది. సీటీఎం రైల్వేగేటుకు చెందిన మహేష్(25) అదే గ్రామానికి చెందిన నాగరాజుకు కొంత కాలం క్రితం రూ.10 వేలు అప్పుగా ఇచ్చాడు. అయితే ఆ డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో మహేష్ అప్పు చెల్లించాల్సిందిగా నిలదీశాడు. దీంతో ఆగ్రహించిన నాగరాజు దాడి చేసి మహేష్‌ను కొట్టాడు. అడ్డువెళ్లిన అతడి భార్య లక్ష్మీదేవిపై కూడా దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయపడిన దంపతులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

యువకుడి వేధింపులతో యువతి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బిందుప్రియ

మదనపల్లె : తనను పెళ్లి చేసుకోమంటూ ఓ యువకుడు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఎలుకల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. పట్టణంలోని బాపూజీ పార్కుకు చెందిన బిందుప్రియ (22)ను ఓ యువకుడు కొంత కాలంగా పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురి చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతుడి ఆచూకీ లభ్యం



సుబ్బారెడ్డి (ఫైల్)

బి.కొత్తకోట : మండలంలోని తుమ్మనంగుట్ట ఫ్లైఓవర్ కింద రైల్వేట్రాక్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ శుక్రవారం లభ్యమైందని ఎస్‌ఐ రామమోహన్ తెలిపారు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి (55)గా ఆయన బంధువులు గుర్తించారు. గుర్తు తెలియని మృతదేహం గురించి పత్రికల్లో కథనాలు రావడంతో బంధువులు పోలీసులను ఆశ్రయించారు. వారికి మృతదేహాన్ని చూపించగా ఆధారాలను పరిశీలించి అవివాహితుడైన తమ బంధువు సుబ్బారెడ్డి మృతదేహమేమని నిర్ధారించారు. ఇతనికి మతిస్థిమితం సరిగా ఉండదని, కాలినడకన ఎక్కడెక్కడికో వెళ్తుంటాడని బంధువులు వివరించారు. ఉగాది రోజు తల్లి స్వగ్రామమైన శ్రీసత్యసాయిజిల్లా అమడగూరుకు వెళ్లాడు. మరుసటి రోజు తన దగ్గర నుంచి గోపిదిన్నెకు బయలుదేరి వెళ్లాడని, మృతుని తల్లి గోపిదిన్నెకు చెందిన కుటుంబీకులతో ఆరా తీసింది. ఇంకా ఇంటికి రాలేదని చెప్పి ఆచూకీ కోసం పలుచోట్ల గాలించారు. గుర్తు తెలియని మృతదేహం వెలుగులోకి వచ్చిన విషయం తెలుసుకొని ఇక్కడికి వచ్చిన బంధువులు సుబ్బారెడ్డిని నిర్ధారించారు. కాగా కుళ్లిన మృతదేహానికి శుక్రవారం ఘటనా స్థలంలో ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామమోహన్ చెప్పారు.

చిరుత సంచారంపై ప్రజల్లో భయాందోళన

రామసముద్రం: మూగవాడి కొత్తూరు సమీపంలో చిరుత పులి తిరుగుతున్నట్లు ప్రచారం మండలంలో దావానంలా వ్యాపించింది. గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంలో ఇద్దరు ప్రయాణిస్తుండగా రోడ్డు దాటుతూ ఒక చిరుతపులి కనిపించినట్లు తెలిపారు. దీనిపై పొలాల్లో పనులు చేసుకునే కూలీలు, రైతులు, ప్రయాణికులు భయాందోళనకు గురౌతున్నారు. ఎటునుంచి చిరుత పులి వస్తుందో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రోజేదారో.. జర ధ్యాన్‌దో..

- బీపీ, షుగర్ వారి ఆహార నియమాల్లో జాగ్రత్తలు అవసరం
- రక్తంలో చక్కరస్థాయి పెరగకుండా నియంత్రణ ముఖ్యం



ఉపవాస దీక్ష విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్

మదనపల్లె సిటీ : ఇస్లాంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. అన్నమయ్య జిల్లాలో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ మాసంలో వారు 30 రోజుల పాటు కఠోరమైన ఉపవాసదీక్షలు పాటిస్తారు. తెల్లవారుజామున నుంచి సూర్యాస్తమయం వరకు సుమారు 14 గంటల సేపు ఎలాంటి ఆహార పానీయాలు సేవించరు. భక్తిశ్రద్ధలతో ఆచరించే ఉపవాసదీక్షల వల్ల ఆరోగ్యవంతులకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా.. చిన్నారులు, బీపీ, షుగర్, గ్యాస్టిక్, కిడ్నీ సమస్యలు ఉన్నవారు కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. బీపీ, షుగర్ సమస్య ఉన్న వారు వేళకు ఆహారం తీసుకుంటూ మందులు వాడాల్సి ఉంటుంది. ఉపవాస సమయంలో.. వేకువజామున సహరీకి ముందు, సాయంత్రం దీక్ష విరమించి ఇఫ్తార్ తర్వాత మాత్రమే ఆహారాన్ని స్వీకరిస్తారు. ఈ మధ్య సమయంలో కనీసం మంచి నీళ్లు కూడా స్వీకరించరు. దీక్ష విరమణ తర్వాత కార్బొహైడ్రేడ్లు, ప్రొటీన్లు, అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడంతో శరీరంలో చక్కర స్థాయి హెచ్చు,తగ్గులకు గురవుతుంది. షుగర్ వ్యాధి ఉన్న వారు ఉపవాసదీక్షలు చేయడం వల్ల చక్కర గాఢత పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపవాసదీక్షలో ఉండే వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ వైద్యులు తెలియజేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- షుగర్ నియంత్రణలో ఉంచుకుంటూ రంజాన్ దీక్షలను కొనసాగించవచ్చు. ఇఫ్తార్ సమయంలో తక్కువ కేలరీల శక్తి వున్న ఆహార పదార్థాలు, పానీయాలు మాత్రమే సేవించాలి.
- ఇఫ్తార్ అనంతరం నిద్రపోకూడదు. ఆకుపచ్చని కూరలు, పండ్లు, కూరగాయలు, పెరుగు, గోధుమలతో చేసిన రొట్టెలు తినాలి. ఖర్జూరాలతో పాటు పండ్ల రసాలను తీసుకోవాలి.
- సహరీలో పప్పు, పెరుగు, పండ్లు, కూరగాయాలు, చక్కర సహిత పానీయాలు, నీరు ఎక్కువగా తీసుకోవాలి.
- నూనెలో వేయించిన పరోటా, పూరీ, సమోసాలు, కబాబ్‌లు, రవ్వతో వేయించిన ఆహార పదార్థాల వాడకం తగ్గించాలి. నూనె కూడా కనీస మోతాదులోనే వాడాలి.
- ఉపవాసానికి ముందు తరువాత బ్రెడ్, బీన్స్, ముడి బియ్యంతో వండిన ఆహారం తీసుకోవాలి.
- కిడ్నీ సమస్యలు ఉన్న వారు సహరీ సమయంలో ఎక్కువ నీటిని తీసుకోవాలి.
- బీపీ ఉన్న వారు పాలు, గంజి, జ్యూస్, కొబ్బరి నీళ్లు, మజ్జిగలాంటి ద్రవ పదార్థాలను – ఎక్కువగా తీసుకోవాలి.

సలహాలు తప్పనిసరి



షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలు ఉన్న వారు ఉపవాసదీక్ష చేపట్టే ముందు వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో ఉప్పు, చక్కర, నూనె తక్కువగా ఉండేలా చూసుకోవాలి. సలభంగా జీర్ణమయ్యే కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలి. శక్తికోసం డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే మంచిది. – డాక్టర్ బాబాఫక్రుద్దీన్, వైద్యులు, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

పలు రైళ్లకు అదనపు బోగీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరి–యశ్వంతపూర్, శివమొగ్గ–చెన్నై, బెలగావి–సికింద్రాబాద్ తదితర రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేశామని, మరికొన్ని రైళ్లను పొడిగించామని ఆయన పేర్కొన్నారు.

గ్రామోత్సవంలో అపశ్రుతి



మృతి చెందిన వెంకటరెడ్డి

వీరపునాయునిపల్లె : శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం రాత్రి మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవంలో అపశ్రుతి నెలకొంది. ఈ ఘటనలో వెంకటరెడ్డి (60) మృతి చెందాడు. ఎస్సై రాజా రమేష్ తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించేందుకు పెంకులకొట్టంపైకి ఎక్కడంతో ప్రమాదవశాత్తు కిందపడటంతో వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరి పిల్లలకు వివాహాలయ్యాయి.

రసవత్తరంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



బ్యాలెట్ బాక్స్ భద్రత అంశంపై చర్చిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. శుక్రవారం కోర్టు క్లాంప్లెక్స్ ఆవరణలో రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. పట్టణ పోలీసుల బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 126 ఓట్లకు గాను 121 ఓట్ల పోలింగ్ జరిగింది. ఓటు హక్కు కోల్పోయిన 24 మంది హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజుతోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు ఓటు వేశారు.

బార్ నిర్వహణ గత అసోసియేషన్‌కే అప్పగింత

బార్ అసోసియేషన్ నిర్వహణ గత అసోసియేషన్‌కే అప్పగించారు. ఈ మేరకు ఏపీ బార్ కౌన్సిల్ సెక్రటరీ పద్మలలిత నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. న్యాయవాదులు జిలానీ తదితరులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు.. బార్ నిర్వహణ విషయం గత అసోసియేషన్ చూసుకోవాలని ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ ఉత్తర్వులను ఎన్నికల అధికారి బాలాజీకి మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితర కార్యవర్గం అందజేసింది.

అసోసియేషన్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లు

హైకోర్టు ఆదేశాల మేరకు సీల్ చేసిన బ్యాలెట్ బాక్స్ భద్రతపరిచే అంశాన్ని ఎన్నికల అధికారి బాలాజీకి అప్పగించింది. ట్రెజరీలో డిపాజిట్ చేసుకునేందుకు నిరాకరణ ఎదురైంది. దీంతో శాంతి భద్రతల సమస్యను దృష్టిలో వుంచుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బ్యాలెట్‌బాక్స్‌ను పోలీసుస్టేషన్‌లో పోటీలో ఉన్న ఇరువురు అభ్యర్థుల అంగీకారంతోనే భద్రత పరిచేలా డీఎస్పీ ముందుకొచ్చారు. అయితే ఒక వర్గం ససేమిరా అనడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చివరికి బార్ అసోసియేషన్ కార్యాలయంలో కొత్త బీరువాలో వాటిని భద్రపరిచి, సీజ్ చేశారు. అలాగే అసోసియేషన్ కార్యాలయానికి కూడా తాళం వేసి సీజ్ చేశారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఆనంద్‌కుమార్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈమేరకు సీఐ నరసింహారావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో 24 మంది న్యాయవాదులు ఓట్లను తొలగించారు. ఇందులో దళిత న్యాయవాది ప్రభాకర్ తన ఓటును దళితుడనే ఉద్దేశ పూర్వకంగా తీసేశారని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తండ్రిని హతమార్చిన కుమారుడి అరెస్ట్

పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని గోవిందంపల్లి పంచాయతీ పోలివాండ్లపల్లి గ్రామానికి చెందిన జి వెంకటేశ్వర్లు (45)ను గొంతు నులిమి హత్య చేసిన కుమారుడు శివప్రసాద్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఐ వివరాలు వెల్లడించారు. పోలివాండ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఒక్కగానొక్క కుమారుడు శివప్రసాద్ ఉన్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు చుట్టు పక్కల గ్రామాలలో కూలి పనులు చేసుకుంటూ పూజలు, తాయత్తులు వేస్తూ జీవనం సాగించేవాడు. కుమారుడు శివప్రసాద్ ప్రేమ వివాహం చేసుకొని ముద్దనూరులో నివాసం ఉండేవాడు. ఉగాది పండుగకు ఇంటికి వచ్చిన కుమారుడు శివప్రసాద్‌తో తండ్రి వెంకటేశ్వర్లు గొడవపడి చేతబడి చేస్తానని బెదిరించాడు. తన తండ్రి అనుకున్నంత పని చేస్తాడని శివప్రసాద్ తండ్రిని కారులో తీసుకొని.. యల్లాయపల్లె సమీపంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో గొంతు నులిమి హత్య చేశాడు. సమీపంలోని ముళ్లపొదల్లో మృతదేహాన్ని పడేసి ఇంటికి వచ్చాడు. తండ్రి కనిపించడం లేదని బంధువులతో కలిసి చుట్టుపక్కల వెతికాడు. సమీపంలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించి మద్యం మత్తులో చనిపోయాడని శవాన్ని పూడ్చివేశారు. ఈ విషయంపై అనుమానం వచ్చిన మృతుడి తమ్ముడు నరసింహులు తన అన్నను హత్య చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి తహసీల్దార్ పీర్ మున్నీ, సీఐ విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో.. పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా గొంతు నులిమి వెంకటేశ్వర్లు చంపబడ్డాడని తేలడంతో సీఐ విశ్వనాథరెడ్డి ముమ్మరంగా దర్యాప్తు చేశారు. అనుమానాస్పద మృతిని హత్య కేసుగా నమోదు చేసి తండ్రిని హతమార్చిన శివప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతల, కార్యకర్తల నిరసన

రాయచోటి అర్బన్ : ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదం తెలిపి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ బండకింద మనోహర్, ఎంఎస్‌పీ నాయకులు రామాంజనేయులు, రాధాక్రిష్ణమాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని శనివారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల నేతలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధానగేటు వద్ద అడ్డుగా నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నేతలు చెంగయ్య, చిన్న, వెంకటప్ప, నాగరాజ, నాగేంద్ర, ఎంఆర్‌పీఎస్ నేతలు ఆనంద్, సి.వి.రమణ, ఆంజనేయులు, అశోక్, మహదేవ, నరసింహులు, వెంకీ, మహిళా నాయకురాళ్లు జయమ్మ, రెడ్డెమ్మతోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



టి.విష్ణు కావ్య

కలికిరి : మండలంలోని పల్లవోలు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్–5) టి.విష్ణు కావ్యను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ జిల్లా కలెక్టర్ గిరీషా ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మొదటి నుంచి వివాదాలకు నెలవుగా మారింది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సచివాలయానికి వచ్చిన ప్రజలు, తోటి సిబ్బందితో అసభ్య పదజాలంతో మాట్లాడుతుండటంతో ఇప్పటికే పలుమార్లు ఎంపీడీఓ మెమోలు జారీ చేశారు. అయినా తీరు మారకపోగా గతంలో ఎంపీడీఓ పైనే కేసు పెట్టడానికి పూనుకుంది. సచివాలయంలో మరో ఉద్యోగిపైనా కేసు పెట్టింది. ప్రజల నుంచి సైతం ఫిర్యాదులు అందడంతో.. ఆమె సేవలు అవసరం లేదని మార్చి నెల 1న పంచాయతీ తీర్మానం చేసింది. ఎంపీడీఓ గంగయ్యకు నివేదించారు. విచారణ చేసిన ఆయన పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టరుకు పంపించారు. పరిశీలించిన కలెక్టర్ ఆమెను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హంద్రీనీవా కాలువ పూడ్చివేతపై కేసు



కాలువపై వేసిన రోడ్డు, దెబ్బతిన్న కట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె : ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరపడమే కాకుండా, వాటిని తరలించేందుకు హంద్రీ నీవా కాలువను పూడ్చివేసి, కట్టను ధ్వంసం చేసిన వాహన యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ సీకే శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని వలసపల్లె బ్లాక్ ఏరియా సర్వే నంబర్ 590లో హంద్రీ నీవా కాలువలో అక్రమంగా రోడ్డు ఏర్పాటు చేసుకుని అవతలి వైపున ప్రభుత్వస్థలంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో తహసీల్దార్ సీకే శ్రీనివాసులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించగా, మట్టిని తవ్వుతున్న హిటాచీ, లోడ్ చేసుకుని వెళుతున్న మూడు టిప్పర్లు కనిపించాయి. హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహం జరగకుండా కాలువను పూడ్చివేసి మట్టి తరలింపు కోసం రోడ్డు ఏర్పాటు చేసుకోవడాన్ని గుర్తించారు. కాలువ రెండు వైపులా కట్ట ధ్వంసం కావడంతో వాహన యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు టిప్పర్లు, హిటాచీని స్వాధీనం చేసుకుని వాహన యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. హంద్రీ–నీవా కాలువకు ఆవలివైపున అక్రమంగా మట్టి తవ్వకాలు చాలా రోజులుగా జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడంతో వాహన యజమానులు ఏకంగా హంద్రీనీవా కాలువను పూడ్చివేసి మట్టిని తరలించేందుకు సాహసించారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా కాలువలో అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించి, కాలువను పూర్వస్థితికి తేవాలని కోరారు. తనిఖీల్లో ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వో సాంబశివ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బందిపై దౌర్జన్యం

ముగ్గురిపై కేసు నమోదు

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందిపై దౌర్జన్యం చేసి, ప్రైవేటు అంబులెన్స్ అద్దాలు పగలగొట్టి వీరంగం సృష్టించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని గాంధీపురానికి చెందిన మస్తాన్‌సాబ్ కుమారుడు దావూద్(21) ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి రాగా అతనితోపాటు గాంధీపురానికి చెందిన కాలేషా కుమారుడు మహమ్మద్‌షనీ(25) ధన (23) త్వరగా చికిత్సలు చేయలేదని నర్సింగ్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు వచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు వచ్చిన ప్రైవేటు అంబులెన్స్ ఆపరేటర్లతో గొడవకు దిగి, ప్రైవేటు అంబులెన్స్ వాహన అద్దాలను పగలగొట్టి వీరంగం సృష్టించారు. వారి ముగ్గురిపై ప్రైవేటు అంబులెన్స్ ఆపరేటర్ రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవం



ప్రసవించిన శిశువుతో బి.కొత్తకోట ఆస్పత్రిలో విద్యార్థిని



ఆస్పత్రిలో బాలికను విచారణ చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

బి.కొత్తకోట : తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మగ శిశువును ప్రసవించిన ఘటన శుక్రవారం సంచలనం కలిగించింది. ఓ వివాహితుడు మూడేళ్లుగా బాలికను ఓ ఇంటి వద్దకు తీసుకెళ్తూ అఘాయిత్యానికి పాల్పడుతూ గర్భానికి కారకుడైనట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరుకు చెందిన 14 ఏళ్ల బాలిక స్థానిక జెడ్పీహైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ బాలిక తల్లిదండ్రులు ఆరునెలల క్రితం విడాకులు తీసుకుని విడిగా ఉంటున్నారు. బాలిక స్వగ్రామంలో తండ్రి వద్దనే ఉంటోంది. బాలిక తండ్రి మూడేళ్ల క్రితం టైలరింగ్ వృత్తి వదలి గొర్రెలను మేపుకొంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బాలికకు కడుపునొప్పిగా ఉండటంతో కుటుంబ సభ్యుల సమాచారంతో 108లో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవ పరిస్థితి కలిగింది. శిశువు తల వెలుపలికి రావడంతో సిబ్బంది వైద్యసేవలు అందిస్తూ బి.కొత్తకోట సీహెచ్‌సీకి చేరుకున్నారు. ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ హసీనా బేగం బాలికకు శస్త్రచికిత్స చేయకుండానే సహజ ప్రసవం అయ్యేలా వైద్యం అందించారు. తర్వాత బాలిక, శిశువును పరీక్షించి ఆరోగ్యంగానే ఉన్నట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ సాధిక్ అలీ, పీటీఎం ఎస్‌ఐ మధురామచంద్రుడు సిబ్బందితో ఆస్పత్రికి చేరుకుని బాలికను విచారణ చేశారు. కందుకూరుకు చెందిన నరసింహులు అనే యువకుడికి వివాహమైంది. ఇతను మూడేళ్లుగా బాలికను ఓ పాడుబడిన ఇంటివద్దకు తీసుకెళ్లి శారీరకంగా కలిసేవాడని, ఈ విషయం ఇంటిలో చెప్పలేదని బాలిక పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు

బాధితురాలైన బాలికను నరసింహులు వేధిస్తున్నాడని పోలీసులకు రెండుసార్లు ఫిర్యాదు చేసినా, వారు నరసింహులుపై చర్యలు తీసుకోలేదని.. దీనితో తమబిడ్డ జీవితాన్ని నాశనం చేశాడంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కాగా, బాలిక ఉదంతంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విడిపోయిన రైలు వ్యాగిన్లు

పలురైళ్లు నిలిపివేత



విరిగిపోయిన వ్యాగిన్ కప్లింగ్ నక్కల్

రాజంపేట : ముంబయి–చెన్నై రైలు మార్గంలో కడప–నందలూరు సెక్షన్ల మధ్య కనుమలోపల్లె–భాకరాపేట(248/3కి.మీ) మధ్య శుక్రవారం ఐరన్‌ఓర్ (ఏకేపీకే) కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే గూడ్స్‌రైలు ఫార్మిసిన్ తెగిపోయింది. డబుల్‌లైనులో అప్‌లైన్(నందలూరువైపు)లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ సమయంలో ఈ మార్గంలో నడిచే పలురైళ్లను నిలిపివేశారు. ఇందులో కాచిగూడ–మంగళూరు ఎక్స్‌ప్రెస్, కడప–అరక్కోణం ప్యాసింజర్ రైళ్లను కనుమలోపల్లిలో నిలిపివేశారు. ఈ రైళ్లతో పాటు పలు గూడ్స్‌రైళ్లను కూడా నిలిపివేయాల్సి వచ్చింది.

తెగిపోయిన కప్లింగ్ నక్కల్

ఏకేపీకే గూడ్స్‌రైలు ఫార్మిసిన్‌లో లోకో(రైలింజన్) నుంచి 42 వ్యాగిన్ ఎస్‌ఈసీఆర్1167, ఈసీఆర్ 11144 వ్యాగిన్ మధ్య కప్లింగ్ నక్కల్ తెగిపోయింది. దీంతో గూడ్స్‌రైలు ఫార్మిసిన్ రెండు భాగాలు వేరుపడ్డాయి. ఒక భాగం లోకో, మరోభాగంకు గార్డు బ్రేక్‌లు వేర్వేరు కావడంతో రన్నింగ్‌స్టాఫ్ అప్రమత్తయ్యారు. విడిపోయిన ఫార్మిసిన్ వ్యాగిన్లు నిలిచిపోయాయి.

రంగంలోకి దిగిన టీఎక్స్ఆర్ సిబ్బంది

గూడ్స్‌రైలు తెగిపోవడంతో టీఎక్స్ఆర్ సిబ్బందిని రంగంలోకి దింపారు. కప్లింగ్ నక్కల్ తెగిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. బీపీసీ(బ్రేక్‌పవర్ సర్టిఫికెట్) ఎక్కడ ఇచ్చారు, ఎలా అనే అంశం గురించి తెలుసుకున్నారు. వివరాలను గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా పంపారు.

భాకరాపేటకు చేరిన విడిపోయిన ఫార్మిసిన్

తెగిపోయిన ఐరన్‌ఓర్ గూడ్స్‌రైలు ఫార్మిసన్ భాకరాపేటకు తీసుకొచ్చారు. లోకోతో పాటు వచ్చిన వ్యాగిన్లను తీసుకొచ్చేశారు. అలాగే తెగిపోయి విడిగా ఉన్న ఫార్మిసిన్ కూడా భాకారపేటకు తీసుకువచ్చారు.

ఆస్పత్రిలో వసూళ్లు చేస్తే ఉపేక్షించేది లేదు

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది నగదు వసూలుకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ దివాకర్ అన్నారు. శుక్రవారం వారు ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో తనిఖీలు చేశారు. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలోని సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ విభాగంలో గొడవ జరిగిన సమయంలో వెంటనే స్పందించాలని అవుట్‌పోస్ట్ పోలీస్ సిబ్బందికి సూచించారు. గురువారం రాత్రి ఆస్పత్రిలో మద్యం మత్తులో ఆస్పత్రి సిబ్బందిపై దౌర్జన్యం చేసి వీరంగం చేసిన యువకుల గురించి ఆరా తీశారు. అలాగే తాగుబోతుల దాడిలో గాయపడిన రెడ్డిశేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవుట్ పోస్ట్ సిబ్బంది గొడవలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని కొన్ని విభాగాల్లో నగదు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని ఎవరైతే డబ్బులు తీసుకుంటారో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నాగశ్రీతోపాటు సెక్యూరిటీ సూపర్‌వైజర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.